క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: మండలంలోని యడవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. సంబంధిత వేళల్లో గృహాలతో పాటు, పరిశ్రమలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కబడ్డీలో సత్తాచాటిన రాజు



చిలకలూరిపేట: స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బొంతా రాజు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 కబడ్డీ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ చూపి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి ఈ నెల ఆరు నుంచి ఎనిమిది వరకు కావలిలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ విద్యార్థికి ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, స్కూల్ హెచ్‌ఎం కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ అభినందనలు తెలిపారు.

ప్రత్యేక నిధులు ఇవ్వరూ...



నరసరావుపేట: డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో రవాణా, స్పోర్ట్స్ శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో పలు సమస్యల గురించి చర్చించారు. తప్పకుండా నావంతు సహకారం అందిస్తానని మంత్రి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉదయశ్రీ



నరసరావుపేట: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (ఎంఎస్‌సీ)గా స్థానిక టీడీపీ నాయకురాలు, మహిళా న్యాయవాది దాసరి ఉదయశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలకసంఘ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రొంపిచర్ల: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను నరసరావుపేట ఏడీఏ పి. మస్తానమ్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌లను పరిశీలించారు. గూడౌన్స్‌లో తనిఖీలు చేసి స్టాక్ రిజిస్టర్‌లతో ఎరువుల బస్తాలను సరిచూసుకున్నారు. ఎరువులు, పురుగు మందులను రైతులకు అమ్మేటప్పుడు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. బిల్లుపై రైతు సంతకాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. అధిక ధరకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏడీఏ వెంట ఏవో శివ లలిత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు నేటితో పూర్తి

ఈపూరు: గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకునేందుకు ఈ నెల 6వ తేదీ చివరి రోజు అని తహసీల్దార్ నళిని మంగళవారం తెలిపారు. అర్హులైన గ్రాడ్యుయేట్లు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓట్లకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

మాజీ ఎంపీటీసీ కాటా ముసలయ్య మృతి

నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కాటా ముసలయ్య (72) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన ఆరు నెలల క్రిందట రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అయితే అనారోగ్య సమస్యలతో సతమతమౌతూ చికిత్స పొందుతున్నారు. సోమవారం రాత్రి ఆరోగ్యం క్షీణించి మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు.

బైపాస్ రోడ్డా? డంపింగ్ యార్డా?!

- రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం
- హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేసినా లెక్కచేయని వైనం
- పట్టణానికి తూర్పు, పడమర వైపుల నుంచి ప్రసరిస్తున్న దుర్వాసన
- వెంటనే తొలగించాలని కోరుతున్న స్థానికులు
- చర్యలు తీసుకుంటామన్న మున్సిపల్ కమిషనర్



రావిపాడు రోడ్డు పాత చెక్‌పోస్టు సెంటర్ నుంచి వల్లప్పచెరువుకు వెళ్లే బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా పడేసిన చెత్తా చెదారం



నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోకి వాహనాలు రాకుండా వెలుపలి నుంచే వివిధ మార్గాల్లో వెళ్లేందుకు ఏర్పాటుచేసిన బైపాస్ రోడ్డు కాలుష్యానికి నకలుగా మారింది. చెత్తా చెదారంతో పాటు ఇళ్లల్లోని వ్యర్థాలు, చనిపోయిన జంతువుల కళేబరాలు, పడగొట్టేసిన ఇళ్ల శకలాలు, హోటళ్లలో మిగిలిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలు, పండ్లు, హోటళ్లలో వండేందుకు ఉపయోగించిన కట్టెల బొగ్గులు, మసి తదితర వ్యర్థాలతో బైపాస్ రోడ్డు ఇరువైపులా మార్జిన్లు దుర్గంధం వెదజల్లుతూ దర్శన మిస్తున్నాయి. ఎటువంటి చెత్తా చెదారం వేయరాదని, వేసిన వారికి రూ.500లు జరిమానా విధించబడుతుందని హెచ్చరిస్తూ మున్సిపల్ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డును కూడా లెక్కచేయకుండా దానిచుట్టూ చెత్తా చెదారం పడేయటం గమనార్హం. వివరాలను పరిశీలిస్తే..

వినుకొండ రోడ్డు నుంచి గుంటూరురోడ్డును కలుపుతూ సుమారు 9.5 కిలోమీటర్ల బైపాస్‌రోడ్డు నరసరావుపేట పట్టణం చుట్టూ నెలకొని ఉంది.

బీటీ రోడ్డులో ఇలా....

ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద నాలుగేళ్ల నుంచి ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చారు. ఈ రోడ్డు గుంటూరు-కర్నూలు రహదారి నుంచి గుంటూరు రోడ్డులో పాత ఆర్టీవో కార్యాలయం వద్ద కలుస్తుంది. ఇందులో సుమారు పాలపాడు రోడ్డు నుంచి వల్లప్ప చెరువు వరకు ఉన్న బైపాస్ రోడ్డు పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయింది. సుమారు రెండు, మూడు కిలోమీటర్లు ఉండే ఈ రోడ్డుకు పలుచోట్ల ఈ దుస్థితి నెలకొంది. పట్టణ సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే గృహాలు నిర్మించుకొని ఉంటున్నారు.

మార్గమంతా దుర్వాసనే

ఊరికి దూరంగా ఆరోగ్యంగా ఆహ్లాదకరంగా ఉంటుందని గృహాలు నిర్మించుకుంటే ప్రస్తుతం చల్లటి వేళల్లో కంపుకొట్టే గాలితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఉదయాన్నే ఎక్కువ మంది వాకింగ్ చేసేవాళ్లు కూడా ఈ రోడ్డుపైకి వచ్చేందుకు ఇష్టపడటం లేదు. వచ్చిన వారు ముక్కులు మూసుకొని వాకింగ్ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. మరో రెండు నెలలు ఇదే పరిస్థితి కొనసాగితే జొన్నలగడ్డ-కేసానుపల్లి మధ్యలో ఉన్న హైవే రోడ్డుకు పక్కనే ఉన్న డంపింగ్ యార్డును మించిన మరొక డంపింగ్ యార్డు వల్లపచెరువు మధ్య గల బైపాస్‌లో ఏర్పడే ప్రమాదం నెలకొని ఉంది. పట్టణానికి తూర్పు నుంచి ఉదయం వేళల్లో దుర్వాసన పట్టణంలోకి వస్తుంటే సాయంత్రం వేళ పట్టడానికి పడమటి వైపు నుంచి దుర్వాసన వచ్చేస్తుంది. ఇప్పటికే ఈ వాసన ఎక్కువైంది.

హెచ్చరికలు బోర్డుకే !



దీనిపై గతంలోనే మున్సిపల్ అధికారులను హెచ్చరించటంతో ఎటువంటి చెత్తవేయరాదని, వేసిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని బైపాస్‌రోడ్డు డంపింగ్‌యార్డుగా మారకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెడతాం



ఈ ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన నిఘా ఏర్పాటు చేస్తాం. చెత్తవేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వేసిన చెత్తను తొలగించేందుకు కార్యాచరణ రూపొందిస్తా.

– ఎం.జస్వంతరావు, కమిషనర్

24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

బొల్లాపల్లి : భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఇంట్లో నుంచి వెళ్లిన మహిళను ఫిర్యాదు అందిన 24 గంటల లోపే పోలీసులు కేసు ఛేదించి ఆ మహిళను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన వినుకొండ నియోజకవర్గం బండ్లమోటు స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం సాయంత్రం బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం గ్రామానికి చెందిన మాలపాటి చినకోటేశ్వరరావు, నర్సకుమారి దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఇరువురు గొడవపడ్డారు. భార్య నర్సకుమారి తన ముగ్గురు సంతానంలో ఇరువురు కుమారులు రాజా, సిద్ధులను తీసుకొని ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. నర్సకుమారి సోదరుడు మూల కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే మహిళ విజయవాడలో ఉన్నట్లు గుర్తించి బండ్లమోటు స్టేషన్‌కు తీసుకొచ్చారు. భార్యాభర్తల మధ్య కౌన్సిలింగ్ నిర్వహించి మహిళను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రకాశం జిల్లాలో కొనకంచి వారిపాలెం వాసి మృతి



మృతి చెందిన చిన లాజర్

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన గర్నెపూడి చిన లాజర్(36) ప్రకాశం జిల్లా, సంతమాగులూరు మండలం, పుట్టావారిపాలెం గ్రామ సమీపంలో మృతి చెందాడు. రోడ్డు పక్కన చనిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. చేతిపై ఉన్న పచ్చబొట్టు పేరు ఆధారంగా లాజర్‌గా గుర్తించారు. అక్కడి వారు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన లాజర్‌కు భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. హుటాహుటిన లాజర్ బంధువులందరూ బయలు దేరి పుట్టావారిపాలెం వెళ్లారు. లాజర్ మృతితో గ్రామంలోని బంధువుల కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

ఎన్‌పీసీఐతో ఖాతాతో అనుసంధానం చేసుకోవాలి

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య నున్న ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలతో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుసంధానం చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే బ్యాంకు అకౌంట్ ఉన్న వారు బ్యాంకులో ఖాతాను ఎన్‌పీసీఐతో లింకు చేయించుకొని ఆ రసీదును సమీపంలోని సచివాలయంలో అందజేసి డేటాను అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు డీబీటీ విధానంలో జమ చేయబడుతుందన్నారు. అంతేగాకుండా సంక్షేమ పథకాలు నిరాటంకంగా అందజేయబడతాయని తెలిపారు.

ఓట్ల నమోదు గడువు పొడిగించాలి

చిలకలూరిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదుకు గడువు పొడిగించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు కోరారు. ఎస్టీయూ కార్యవర్గ సమావేశం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల నమోదుకు సమయం బుధవారంతో ముగుస్తున్న క్రమంలో సర్వర్ బిజీగాఉండటం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు సబ్మిట్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురౌతున్నాయని తెలిపారు. దీంతో వివిధ కార్యాలయాల్లో ఓట్ల నమోదు దరఖాస్తులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఇంకొంత గడువు పొడిగించాల్సిన ఆవశ్యకత ఎన్నికల కమిషన్‌పై ఉందని పేర్కొన్నారు. ఎస్టీయూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుద్యోగులు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న క్రమంలో సకాలంలో ఓటు నమోదు చేయించుకోలేని పరిస్థితి నెలకొందని, వారి కోసం అవకాశం కల్పించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కొత్తగా ఆన్‌లైన్ ప్రక్రియ ప్రవేశపెట్టడం, దీంట్లో సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్ కాకపోవడం తలెత్తుతున్న క్రమంలో తప్పనిసరిగా గడువు పొడిగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గడువు పెంచని పక్షంలో ఎంతో మంది ఓటుహక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వి అక్కయ్య, ఎం కోటేశ్వరరావు, వి జయప్రకాశ్, మగ్బుల్‌బాష, దుర్గాప్రసాద్, జి కోటేశ్వరరావు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు

ఓటు నమోదు చేసుకోవాలి

చిలకలూరిపేట: కృష్ణా,గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారంతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మున్సినల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి పి శ్రీహరిబాబు తెలిపారు. 2021 అక్టోబర్ 31 లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా పురపాలక సంఘ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామం ఎస్సీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో నివాస గృహంలో ఇంటిలోని సామాను అంతా బూడిద అయిన సంఘటన మంగళ వారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు ఎస్సీ కాలనీకు చెందిన దారా చిన ఏసురత్నం నివాస గృహంలో ఇటీవల శుభాకార్యం నిమిత్తం ఆరుబయట తాటాకు పందిరి పరిధిలో విద్యుత్ మీటరు నుంచి ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు వ్యాపించి వ్యవసాయ పనులు నిమిత్తం తీసుకొచ్చిన బాకీ నగదు రూ.5 లక్షలు రూపాయాలు బీరువాలోని సామాను బంగారు ఆభరణాలు కుటుంబ సభ్యుల దుస్తులు వంట సామాను తదితరవన్నీ పూర్తిస్థాయిలో అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు హుటాహుటిన మంటలను అదుపులోకి వచ్చేలా తమవంతు ప్రయత్నాలు చేశారు. వినుకొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య ఇన్‌చార్జ్ వీఆర్వో ఉప్పలూరి చిన మంగయ్య సచివాలయ వెల్ఫేరు సహాయకులు అనిల్ కాలనీ వాసులు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పారదర్శకంగా వైద్యసేవలు అందించాలి

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది పేద ప్రజలకు పారదర్శకంగా వైద్యసేవలు సకాలంలో అందించాలని జిల్లా గణాంకాధికారి నీల కంఠేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా విస్తరణా అధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్,సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలకంఠేశ్వరరావు

పంటల బీమా పథకాన్ని సద్వినియోగించుకోండి

వినుకొండ(నూజెండ్ల): రైతులు సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సుగుణాబేగం తెలిపారు. నూజెండ్ల మండలంలోని పెద్దవరం, పాత చెరుకుంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, వరి, మిరప పంటలను క్షేత్రసందర్శన చేసి రైతులతో రైతు సేవా కేంద్రం వద్ద సమావేశాలు నిర్వహించారు. పంటల బీమా పథకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కంది పంటలో వెర్రి తెగులుపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూపాటి సురేష్‌కుమార్, ఏఈవో ఎలీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు జి. మణికంఠ, వై.గోపి, జడ్డా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరిలో సుడిదోమ ఉధృతి



కేసానుపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి నరేంద్రబాబు



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవోలు



ఈపూరు మండలంలో వరిపైరును పరిశీలిస్తున్న డీడీఏ శివకుమారి, ఏవో రామారావు

నరసరావుపేట రూరల్: వరిలో సుడిదోమ నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని కేసానుపల్లిలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వరి పంటను పరిశీలించి సుడిదోమ ఉధృతిని గుర్తించారు. సుడిదోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. సుడిదోమ తొలిదశలో రసాన్ని పిల్చడం వలన పైరు లేత పసుపు వర్ణానికి మారుతుందని తెలిపారు. ఉధృతి పెరిగే కొద్ది పైరు సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోతూ ఉంటుందని వివరించారు. ఎసిఫేట్ 1.5గ్రాములు లేదా మెనోక్రోటోఫాస్ 2.2 మి.లీ లేదా ఫెనోబుకార్బ్ 2 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు బుప్రోఫెజిన్ 1.6 మి.లీ పైమెట్రోజైన్ 0.6 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ ఎస్‌కె సాయిబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: మండలంలోని అంగలూరు, గుండేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ వరిలో, మిరప పంటలలో చీడపీడల నివారణ చర్యలు ఎరువుల యాజమాన్యం గురించి వివరించడం జరిగింది. రైతులకు అవగాహన కొరకు పంటలకు సంబంధించిన కరపత్రాలను రైతులకు ఉచితంగా అందజేశారు. అదేవిధంగా మండల వ్యవసాయాధికారి రామినేడి రామారావు మాట్లాడుతూ పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు మీ ఆధార్‌కి బ్యాంక్ లింగ్ లేని వారు పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని సూచించారు. త్వరగా ఈకేవైసీ పూర్తి చేసుకుంటే నగదు వెంటనే వారి ఖాతాలో పడుతుందని తెలిపారు. ఖరీఫ్- 2024లో పంట నమోదు చేసుకున్న వారికి ఫిజికల్ పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బి. గాయత్రి, గ్రామపెద్దలు, రైతులు సోదరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీఏ పి. మస్తానమ్మ పాల్గొన్నారు. ఈ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పొట్ట దశలో ఉన్న వరి పొలంలో తెల్లకంకి, మెడవిరుపు తెగులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వరి పైరుకు అధికంగా ఎరువులు వినియోగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివలలిత, ఆయా గ్రామాల వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నాగేంద్రహారాయ త్రిలోచనాయ...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల నాగమయ్య స్వామి పుట్ట వద్ద నాగుల చవితి పండుగ వేడుకలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పాలు, చలివిండి, నువ్వుల ఉండలు సమర్పించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. పుట్ట వద్ద ఉన్న వేప చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకట్రావు, జానీ, మాదాల శివరామకృష్ణ, మహిళా భక్తులు బత్తుల కళ్యాణి, వల్లెపు కోటేశ్వరి, మాదాల లక్ష్మీసునీత, కొండలు, నారాయణ, తుమ్మా వెంకటకోటమ్మ, వెంకటేశ్వర్లు, కాళంగి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో శివనాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శివనాగేంద్రస్వామి ఆలయ 39వ వార్షిక మహోత్సవం, నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం నాగుల చవితిని భక్తులు విశిష్ట పర్వదినంగా భావిస్తారు. ఉదయం 5 గంటల నుంచే వార్లు పోయటం, పూజా కార్యక్రమాలు, దీపాలంకణ చేశారు. ఆలయ పూజారి దర్శి ఉమా మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాదెండ్ల శ్రీ వెంకటేశ్వర వీరాంజనేయ సంకీర్తన బృందం వారిచే భజనా కార్యక్రమం, సరస్వతి సంగీత కళాశాలకు చెందిన శ్రీలక్ష్మి శిష్య బృందం సభ్యులు సంగీత కచేరి నిర్వహించారు. నాగరాజ భజనా సమాజం వారిచే భజనా కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం సందడిగా మారింది. సాయంత్రం స్వామి వారి జెండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అవుపాలు, వార్లు పోసేందుకు వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో 4-6 వారాల పాటూ నూతన దంపతులు పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు కోండ్రు సాంబశివరావు, మార్తూరి సుధాకర్, సింగు సత్యనారాయణ, ఎస్.మధుసూదనరావు, కుమారయ్య, కోండ్రు నాగేశ్వరరావు పర్యవేక్షించారు.



ఇస్సప్పాలెంలోని నాగేంద్రుని పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నరసరావుపేట పరిధిలో...

నరసరావుపేట రూరల్: నాగులచవితి వేడుకలను మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇస్సప్పాలెం అమ్మవారి ఆలయంలో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలోని నాగేంద్రుని పుట్ట, వినుకొండరోడ్డు శ్రీనివాస గిరిజన కాలనీ, ఎన్ఎస్‌పీ కాలనీలోని పుట్ట వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే నాగేంద్రుని పుట్టల వద్ద మహిళల కోలాహలం నెలకుంది. పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. ఇస్సప్పాలెంలో మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఎస్.మాధవి దేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గణపవరంలో శివ నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజల్లో భక్తులు



నాదెండ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిరుమామిళ్ళలో ఆర్డీవో మధులత పర్యటన



నాదెండ్ల: నరసరావుపేట ఆర్డీవో మధులత మంగళవారం చిరుమామిళ్ళ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న పోరంబోకు స్థలంలో కొందరు షాపులు నిర్మించుకొని అద్దెలు వసూలు చేస్తున్నారంటూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత నెల 28న నరసరావుపేటలో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. పోరంబోకు స్థలంలో నిర్మించిన షాపులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అద్దెల ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీకి జమ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా షాపులను పరిశీలించారు. రెవిన్యూ అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆమె వెంట తహసీల్దార్ ఏవీ రమణ, సర్వేయర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు మారుతిబాబు, ఠాగూర్‌రెడ్డి, స్వాతి, వీఆర్వో ప్రేమ్‌రాజు, చినబ్రహ్మం తదితరులు ఉన్నారు.